సాక్షి
పెద్దపల్లి
మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024



రాజన్నకు జనహారతి

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. సోమవారం 45వేల మంది భక్తులు రాజన్నను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.



బహుమతులు ప్రదానం

గోదావరిఖని: హైదరాబాద్ నాంపల్లిలో జరిగిన ఆలిండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ నుమాయిష్-2024 బహుమతుల ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/22.4

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జాతీయ కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థులు

మంథని: వరంగల్ జిల్లా నర్సంపేటలో ఈనెల 11న జరిగిన జాతీయస్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో పట్టణానికి చెందిన షోటోకాన్ కరాటే విద్యార్థులు ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించినట్లు ఇన్‌స్ట్రక్టర్ కోంర్డ నాగరాజు తెలిపారు. కటాస్, కుమితే విభాగంలో నాలుగు బంగారు, ఒక సిల్వర్ మెడల్ సాధించినట్లు ఆయన వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పలువురు అభినందించారు.

అధికారుల బదిలీ

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ముగ్గురు అధికారులను బదిలీ చేస్తూ పంచాయతీరాజ్, గ్రామణాభివృద్ధి శాఖ అధికారి సందీప్‌కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళిని భద్రాద్రి కొత్తగూడెం బదిలీ చేశారు. ఆయన స్థానంలో జయశంకర్ భూపాలపల్లి డీపీవో లతను నియమించారు. జెడ్పీ సీఈవో శ్రీనివాస్‌ను కరీంనగర్ బదిలీ చేయగా, ఆయన స్థానంలో మంచిర్యాల జెడ్పీ సీఈవో నరేందర్ నియమితులయ్యారు. డీఆర్డీవో శ్రీధర్‌ను కరీంనగర్ బదిలీ చేయగా ఆయన స్థానంలో ఆదిలాబాద్ డిప్యూటీ సీఈవో రాజేశ్వర్‌ను పెద్దపల్లికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

'ఆయుష్మాన్ భారత్'తో పేదలకు లబ్ధి



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రతినిధులు

పెద్దపల్లిరూరల్: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ ద్వారా పేదలకు రూ.10లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయని కేంద్ర రసాయన, ఎరువుల శాఖ సంయుక్త కార్యదర్శి, ప్రభుత్వ ఆర్థిక సలహాదారు మనోజ్ సేథీ అన్నారు. జిల్లా కేంద్రంలోని భూంనగర్‌లో సోమవారం నిర్వహించిన వికసిత్ భారత్‌యాత్రలో ఆయన మాట్లాడారు. ఉజ్వల్ యోజన ద్వారా రాయితీతో కూడిన వంట గ్యాస్ అందిస్తోందని, ప్రధానమంత్రి స్వానిధి, ముద్ర ద్వారా చిరువ్యాపారులకు నేరుగా రుణాలు అందిస్తోందని ఆయన తెలిపారు. ఆర్డీవో మధుమోహన్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్, మెప్మా అర్బన్ పీడీపీ రజని, నవ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికై గణతంత్ర వేడుకల్లో ప్రశంసపత్రాలు అందుకున్న పద్మశాలీ ఉద్యోగులను సోమవారం సన్మానించారు. తెలంగాణ పద్మశాలీ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. తొలుత మార్కండేయ జయంతి నిర్వహించారు. అనంతరం జిల్లా కమిటీ అధ్యక్షుడు కొలిపాక సారయ్య ఆధ్వర్యంలో పలు శాఖల ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సారయ్య, పరికిపండ్ల కోటేశం, కొలిపాక నగేశ్, తాటిపాముల రమేశ్, ఆడెపు శారద, కేఎస్ వాసు, కన్నం తిరుపతి, సత్యనారాయణ, దత్తాద్రి, శ్రీనివాస్, రమేశ్, శంకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉచిత శిక్షణ

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాలో ఎస్సీ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించేలా కోర్సులు ప్రారంభిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ జిల్లా కార్య నిర్వాహకుడు రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ చదివి 18నుంచి 35ఏళ్ల లోపు వయసు గల ఎస్సీ యువతీయువకులకు గోదావరిఖనిలో సీఆర్ఎం నాన్‌వాయిస్, వాయిస్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గలవారు ఈనెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శిక్షణ సమయంలో వసతి, భోజన సదుపాయాన్ని ఉచితంగానే కల్పిస్తామని పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థులు అనర్హులని వివరించారు వివరాలకు 90593 86238, 94930 03270 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

లక్ష్యం 11.3 మిలియన్ టన్నులు

- బొగ్గు ఉత్పత్తిపై యాజమాన్యం దృష్టి
- రోజువారీగా 2.3లక్షల టన్నులు
- మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీల ద్వారా అవగాహన
- ఉత్సాహ పరుస్తున్న సీఎండీ



బొగ్గు తీస్తున్న షావల్ యంత్రం

గోదావరిఖని: వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు మరో 48రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఇంకా 11.4మిలియన్ టన్నుల బొగ్గు వెలికి తీయాల్సి ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 78 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని యాజమాన్యం లక్ష్యంగా నిర్దేశించింది. అంతర్గతంగా 70మిలియన్ టన్నులుగా నిర్ణయించింది. సింగరేణి సీఎండీ బలరాంతోపాటు డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణరావు ఏరియాల వారీగా పర్యటిస్తూ లక్ష్య సాధనలో పాలుపంచుకునేలా ఉద్యోగులను సన్నద్ధం చేస్తున్నారు. రక్షణతో కూడిన వార్షిక లక్ష్యాలు సాధిస్తేనే సంస్థ లాభాల బాటలో పయనిస్తుందని దిశానిర్దేశం చేస్తున్నారు.

రోజువారీ ఉత్పత్తి 2.30లక్షల టన్నులు..

- ఆర్థిక సంవత్సరం చివరినాటికి 70మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలనేది లక్ష్యం.
- అంతర్గత లక్ష్యాల సాధనలో 90శాతం నమోదు చేయాల్సి ఉంది.

సమాచారం(మిలియన్ టన్నుల్లో)	
వార్షిక లక్ష్యం	70
ఇప్పటివరకు సాధించింది	58.6
సాధించాల్సింది	11.7
రోజువారీ టార్గెట్(లక్షల టన్నులు)	2.30

- ఇందుకోసం రోజూ 2.30లక్షల టన్నుల బొగ్గు వెలికితీయాల్సి ఉంది.
- 70శాతం బొగ్గు ఓసీపీల ద్వారానే సాధించాల్సి ఉంది.
- ఈక్రమంలో ఓసీపీలపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది.
- యాంత్రీకరణ ఉన్న భూగర్భ గనుల్లో కూడా వందశాతం ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగాలని నిర్ణయించింది.
- ఈసారి నైనీబ్లాక్, వీకే-7 ఓసీపీల నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కాకపోవడంతో ప్రస్తుతం ఉన్నగనులపై ఒత్తిడి పెరిగింది.
- అటవీ అనుమతులతో రెండు ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కాలేదు.
- ప్రస్తుతం ఉన్న 11ఏరియాల్లో నాలుగు ఏరియాలు వందశాతానికి మించి బొగ్గు ఉత్పత్తి సాధించాయని అధికారులు చెబుతున్నారు.
- ఒక ఏరియా 99శాతం, మరో ఏరియా 96శాతం నమోదు చేశాయి.
- గతంలో వెనుకబడిన అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు గనిలో ప్రస్తుతం ఉత్పత్తి పుంజుకుంది.
- భూపాలపల్లి ఏరియాలో బొగ్గు ఉత్పత్తి తగ్గి సంస్థలోనే వెనుకంజలో ఉంది.

కార్మికుల్లో నూతనోత్తేజం..

సింగరేణి సీ అండ్ ఎండీగా బాధ్యతలు చేపట్టిన ఎస్.బలరాం కార్మికుల్లో చైతన్యం తీసుకురావాలని నిర్ణయించారు. ఈక్రమంలో పలు గనుల్లో ఆకస్మికంగా పర్యటించి ఉద్యోగులు, కార్మికులతో నేరుగా మాట్లాడారు. పనిగంటలు పెంచాలని, నాణ్యమైన బొగ్గు వినియోగదారులకు అందించాలని దిశానిర్దేశం చేశారు. నాలుగేళ్లుగా మూలనపడిన మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ సమావేశాలు పునరుద్ధరించారు. షిఫ్టు, గని, ఏరియా, భూగర్భ గని, ఓసీపీల ద్వారా సంస్థకు వస్తున్న లాభనష్టాల గురించి వివరించారు. సంస్థ లాభాల్లో సాగేందుకు అందరి సహకారం అవసరమని, దీనికోసం భారీ యంత్రాలను సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని సందేశమిచ్చారు.

లక్ష్య సాధనతోనే భవిష్యత్



వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధిస్తే సంస్థకు ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. ప్రస్తుత పనివిధానం మరింత పెంచాలి. ఉత్పత్తి, ఉత్పాదకత సాధనలో అధికారులు, కార్మికులు సమష్టిగా పనిచేయాలి. ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దాలి. ఉద్యోగుల సంక్షేమం కోసం యాజమాన్యం ఎంతగానో పనిచేస్తోంది.

బలరాం, సింగరేణి సీ ఎండీ

సమస్యలివిగో.. పరిష్కారం చూపరూ..



ప్రజావాణికి ఆలస్యంగా వచ్చిన వారి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

- ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలనుంచి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అర్జీలను స్వీకరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. అయితే, దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టితో పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యం చేసేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పలు ప్రభుత్వశాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



'పాలకుర్తి మండలం కన్నాల క్వారీల్లో అక్రమంగా బ్లాస్టింగ్ చేస్తూ రూ.కోట్ల విలువైన బండరాయిని తరలించేవారిపై చర్యలు తీసుకోవాలి. దీనిపై ఇప్పటికే పలు పర్యాయాలు అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. అనుమతి లేకుండా చేస్తున్న బ్లాస్టింగులను ఆపేలా మీరైనా చర్యలు తీసుకోండి' అని బామ్లానాయక్ తండా మాజీ సర్పంచ్ రాజునాయక్ కలెక్టర్‌ను కలెక్టర్‌కు విన్నవించాడు. – రాజునాయక్, బామ్లానాయక్‌తండా

- 'ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లిలో నేను పండిస్తున్న పంట ధ్వంసం చేశారు. ఆ భూమిలో వేరేవాళ్లు దౌర్జన్యంగా సాగు చేసుకుంటున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలి. నష్టపోయిన పంటకు పరిహారం ఇప్పించి ఆదుకోవాలి' అని రైతు భూదేవి కోరింది.
- 'దివ్యాంగురాలినైన నాకు పింఛన్ ఇప్పించి ఆదుకోవాలి' అని రామగుండం కార్పొరేషన్ 18వ వార్డుకు చెందిన మమత విన్నవించింది.

కథల పోటీల్లో విద్యార్థి ప్రతిభ



శ్రీలతను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ధర్మారం(పెద్దపల్లి): జాతీయ సైన్స్‌దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయిలో నిర్వహించిన లీలావతి దవే సైన్స్ ఫిక్షన్ కథల పోటీల్లో నర్సింహులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థి వేల్పుల శ్రీలత ప్రథమ బహుమతి సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు నాగుల రవీందర్, తెలుగు ఉపాధ్యాయుడు కందుకూరి భాస్కర్ తెలిపారు. శ్రీలతకు త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో నగదుతోపాటు జ్ఞాపిక, ప్రశంసపత్రం అందించనున్నట్లు నిర్వాహకులు వీఆర్ శర్మ, గరిపెల్లి అశోక్, పద్మావతి తెలిపారు. అదేవిధంగా పదో తరగతి చదువుతున్న బొట్ల లక్ష్మీ గణేష్‌కు కూడా ప్రత్యేక బహుమతి లభించినట్లు పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పలువురు అభినందించారు.

ప్రాణదాతలపై చర్యలు శోచనీయం



నిరసన తెలుపుతున్న ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు

- కామారెడ్డి జీజీహెచ్ డాక్టర్లపై సస్పెన్షన్ ఎత్తివేయాలి
- 'ఖని' జీజీహెచ్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి వైద్యుల నిరసన

కోల్‌సిటీ(రామగుండం): ఆస్పత్రిలో పేషెంట్‌ను ఎలుకలు కొరికితే డాక్టర్లను బాధ్యులను చేయడం సిగ్గుచేటని గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి జీజీహెచ్ ఐసీయూలోని పేషెంట్‌ను ఎలుకలు కొరికితే డాక్టర్లను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు గోదావరిఖని జీజీహెచ్ ఎదుట తెలంగాణ టీచింగ్ ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్(టీటీజీడీఏ) రామగుండం యూనిట్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. డీఎంఈకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆస్పత్రిలో గాడితప్పిన శానిటేషన్ విషయాన్ని గాలికి వదిలేసిన ఉన్నతాధికారులు, సంఘటనకు సంబంధం లేని డాక్టర్లను సస్పెండ్ చేయడం విడ్డూరంగా ఉంద పలువురు వైద్యులు అన్నారు. శానిటేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమస్యలు ఆస్పత్రిలో పని చేస్తున్న డాక్టర్లకు సంబంధించిన విషయం కాదని స్పష్టం చేశారు. దీనిపై సరైన విచారణ నిర్వహించకుండానే డాక్టర్లను బాధ్యులను చేసి మానసిక వేధింపులకు గురిచేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రిలో శానిటేషన్ ఎవరు చూస్తారో కూడా డీఎంఈకి తెలియకపోవడం శోచనీయమన్నారు. వెంటనే బాధిత డాక్టర్లపై సస్పెన్షన్ ఎత్తివేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు రాజు, శిరీశ, ఫరీద్, రవివర్మ, గోపి, అనూష, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో 'టాస్క్' సెంటర్ ఏర్పాటు

- ప్రభుత్వ ఐటీఐ, మండల సమాఖ్య భవనాల పరిశీలన
- యువతలో నైపుణ్యం పెంచేందుకే ఏర్పాటు
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా
- కార్యరూపం దాలుస్తున్న మంత్రి ఆదేశాలు



భవనాలను పరిశీలిస్తున్న కలెక్టర్, టాస్క్ సీఈవో

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) సెంటర్ ఏర్పాటుకు కార్యాచరణ ప్రారంభించారు. జిల్లాకు చెందిన రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సోమవారం టాస్క్ సెంటర్ నిర్వహణకు అనులమైన భవనాల కోసం అన్వేషణ ప్రారంభించారు. తొలుత జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ, మండల సమాఖ్య, డీఎల్‌పీవో, ఎంపీడీవో ఆవరణలోని భవనాలు పరిశీలించారు.

ప్రతిభానైపుణ్యాల పెంపు..

పెద్దపల్లిలో టాస్క్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ఈ కేంద్రం ఏర్పాటుతో జిల్లాకు చెందిన యువత తమ ప్రతిభానైపుణ్యాలను పెంపొందించుకుని పోటీపరీక్షల్లో నెగ్గి ఉద్యోగావకాశాలు దక్కించుకునేందుకు వీలు కలుగుతుందని ఆయన అన్నారు. పారిశ్రామిక ప్రాంతమైన జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మానవవనరుల సేవలను సమర్థవంతంగా అందించేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం, పరిశ్రమ, విద్యాసంస్థల మధ్య సమన్వయం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అనువైన భవనంలోనే ఏర్పాటు..

అనువైన భవనంలోనే టాస్క్ సెంటర్ ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తామని టాస్క్ సీఈవో శ్రీకాంత్‌సిన్హా అన్నారు. ప్రస్తుత పోటీప్రపంచంలో ప్రతిభాపాటవాలు ఉన్నవారికే ఉద్యోగావకాశాలు దక్కుతాయని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు కానున్న టాస్క్ సెంటర్ ద్వారా ఈ ప్రాంత యువతకు ఎంతో మేలు కలుగుతుందని అన్నారు. వారి వెంట టాస్క్ మేనేజర్ ప్రదీప్‌రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ మేనేజర్ గంగాప్రసాద్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

431 పనులు... రూ.40.33కోట్లు



గిరీశ్‌బాబు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఉపాధిహామీ ద్వారా 431 అభివృద్ధి పనులు చేపడతామని,ఇందుకోసం రూ. 40,33,431 వెచ్చించేందుకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అనుమతి ఇచ్చారని పంచాయతీరాజ్‌శాఖ ఈఈ గిరీశ్‌బాబు తెలి పారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించేందుకు వీటిని మంజూరు చేశారన్నారు.

మండలం	నిధులు (రూ.కోట్లలో)	పనుల సంఖ్య
పెద్దపల్లి	2.25	31
జూలపల్లి	0.95	16
సుల్తానాబాద్	1.85	29
ఓదెల	1.85	21
శ్రీరాంపూర్‌లో	1.5	24
ఎలిగేడు	1.20	16
మంథని	8.17	88
కమాన్‌పూర్	2.01	30
రామగిరి	4.98	51
ముత్తారం	6.55	65
అంతర్గాం	2.63	12
పాలకుర్తి	3.79	24
ధర్మారం	2.60	24

పెద్దపల్లిలో కాషాయ జెండా ఎగురవేస్తాం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి

జ్యోతినగర్(రామగుండం): పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. ఎన్టీపీసీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పార్టీ నేత అయోధ్య రవీందర్ నేతృత్వంలో హిందూవాహిని రాష్ట్ర కార్యదర్శి పైతరి రాజు తన అనుచరులతో సోమవారం బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సునీల్‌రెడ్డి మాట్లాడారు. దేశంలో నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్‌లో బీజేపీ జెండా ఎగురవేసి ప్రధాని మోదీకి బహుమతిగా ఇవ్వాలని కోరారు. యువత బీజేపీ వైపు చూస్తోందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ తుడిచిపెట్టుకుపోయిందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ అభ్యర్థులకు ఓటువేస్తే వృథాగా పోతుందని చెప్పారు. కమలం పువ్వుగుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఆయన కోరారు. నాయకులు కందుల సంధ్యారాణి, బల్మూరి వనిత, అమరేందర్‌రావు, తోట కుమారస్వామి, సంపత్, రాజు, వినయ్ పాల్గొన్నారు.

రామగుండం సీపీగా శ్రీనివాసులు



శ్రీనివాసులు

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనర్‌గా ఎం.శ్రీనివాసులు నియామకమైయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఆదేశాలు జారీచేశారు. 2006బ్యాచ్‌కు చెందిన డీఐజీ శ్రీనివాసులు పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్నారు. గతంలో ఇక్కడకు బదిలీ అయిన ఎస్.చౌహాన్ ఆర్డర్‌ను రద్దు చేశారు. కాగా శ్రీనివాసులు గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ ఎస్పీగా పనిచేశారు.

అడిషనల్ డీసీపీగా శ్యామ్‌బాబు

రామగుండం అడిషనల్ డీసీపీ(ఆపరేషన్స్)గా వి.శ్యామ్‌బాబును నియమించారు. ఈయన ప్రస్తుతం ట్రాన్స్‌కోలో అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్నారు. మరోవైపు.. పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్ నారాయణపేటకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సీఐడీలో డీఎస్పీగా పనిచేస్తున్న సీహెచ్ శ్రీనివాస్‌ను నియమించారు.

మేడారానికి 203 బస్సులు

పెద్దపల్లిరూరల్: మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు పెద్దపల్లి నుంచి నడిపే బస్సులను ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో అందుబాటులో ఉంటాయని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. సోమవారం ఐటీఐ ఆవరణ స్థలాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. పెద్దపల్లి నుంచి మేడారం జాతరకు జగిత్యాల, కోరుట్ల, సిరిసిల్ల డిపోలకు చెందిన 203 బస్సులు నడుస్తాయన్నారు. ఇవి స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో నిలిచి ఉంటాయని పెద్దపల్లి ఆర్టీసీ బస్‌స్టేషన్ మేనేజర్ రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నభోజనం నాణ్యంగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారులతో సోమవారం తన కార్యాలయంలో సమావేశమై పలు సూచనలు చేశారు. నాణ్యమైన బియ్యాన్ని సరైన తూకంతో అందించాలన్నారు. లంచ్‌అండ్ లర్న్‌తో భోజన నాణ్యతను పరిశీలించి నివేదిక ఇవ్వాలని సూచించారు. అధికారులు ఒత్తిడికి లోనుకాకుండా వ్యాయామం, వాకింగ్ చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో పనిచేసే అధికారులు, సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్ రూపొందిస్తామని అన్నారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. క్రీడాసామగ్రి లేని పాఠశాలలకు వాటిని సమకూరుస్తామని ఆయన పేర్కొన్నారు.

సోషల్ స్టడీస్ విద్యార్థులకు అభినందన

రాష్ట్రస్థాయి సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో జరిగిన పోటీల్లో జిల్లా విద్యార్థులు పాల్గొని ప్రతిభను చూపడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో కవిత, మార రమేశ్, సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, సరోజశర్మ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలి

స్థానికంగా మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులతో సోమవారం కాసేపు ముచ్చటించారు. విద్యార్థుల సంఖ్య, ల్యాబ్‌లు, వసతులు తదితర విషయాలపై ఆరా తీశారు.

బాగా చదువుతున్నారా?

'చదువెలా సాగుతోంది.. బాగా చదువుతున్నారా' అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బస్టాప్ వద్ద ఉన్న విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్ నుంచి బయటకు వస్తూ బస్టాప్ వద్ద కాసేపు కూర్చుని విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. 'మీరేం చదువుతున్నారు'అని వారిని ఆరా తీశారు. తామంతా డిప్లొమాలో చేరామని విద్యార్థులు బదులిచ్చారు. తాను మైనింగ్‌లో డిప్లొమా చేస్తున్నానని కోంర్డ మహేశ్, బీటెక్ ఈఈఈలో చేరానని దుర్శెట్టి సాయిచరణ్, సీఎస్ఈలో చేరానంటూ రామిళ్ల యశ్వంత్ కలెక్టర్‌తో చెప్పారు. మీరంతా ఓ ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకుని, ఆ లక్ష్యసాధనలో ముందుంటే భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అదే మీ తల్లిదండ్రులకు సంతోషాన్ని, సమాజంలో గౌరవాన్ని ఇస్తుందని గుర్తుంచుకోవాలని సూచించారు. బాగా చదివి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షిస్తూ కలెక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

క్లుప్తంగా

'కాళేశ్వరంలో అవినీతి'

కమాన్‌పూర్(మంథని): కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలు లేవని బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పించుకోవడం శోచనీయమని కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టుల్లో అవినీతి బయటపడుతుందనే భయంతోనే బీఆర్ఎస్ నాయకులు కృష్ణాగోదా జలాలతో సెంటిమెంట్‌ను తెరపైకి తీసుకొస్తున్నారని విమర్శించారు. అనంతరం మాజీ సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు వైనాల రాజు, శేవ్వ శంకరయ్య, బాద్రపు శంకర్, సాగి శ్రీధర్‌రావు, అడెపు రమేశ్, చొప్పరి శేఖర్, కుక్క రవి, బొజ్జ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకాపరి మృతదేహం లభ్యం

ముత్తారం(మంథని): పోతారం గ్రామానికి చెందిన చల్ల లింగయ్య(50) అనే పశువుల కాపరి మృతదేహం యాతల్ చెరువులో సోమవారం లభ్యమైంది. ఆదివారం పశువులను తోలుకెళ్తూ ప్రమాదవశాత్తు లింగయ్య చెరువులో పడి గల్లంతైన విషయం విదితమే. ఎస్సై మధుసూదన్‌రావు ఆధ్వర్యం గజఈతగాళ్లతో ఆదివారం చీకటిపడే వరకూ గాలింపు చర్యలు పట్టారు. అయినా, ఆచూకీ దొరకలేదు. సోమవారం నీటిపైకి బయటకు తేలిన మృత దేహాన్ని గజఈతగాళ్లతో బయటకు తీయించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసుద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


'మార్కెట్ చైర్మన్‌పై దాడి అమానుషం'

రామగుండం: అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్మన్, ఆర్యవైశ్య నేత బలుస అరుణపై రైతులు దాడి చేయడం అమానుషమని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోమవారం రామగుండం ఆర్యవైశ్య ప్రతినిధులు ఒక ప్రకటన విడుదల చేశారు. అన్నిరంగాల్లో ఆర్యవైశ్యులు రాణిస్తూ, దానధర్మాలకు ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. ఇలాంటి ఆర్యవైశ్య ప్రజాప్రతినిధులపై దాడికి ఒడిగట్టిన వారిపై రాష్ట్ర ప్రభుత్వం కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ప్రతినిధులు కోలేటి శ్రీనివాస్, రామిని శశిధర్, కాసనగొట్టు శ్యాంసుందర్, దేమ లక్ష్మీనారాయణ, కట్కూరి ఆత్మలింగం, దొంతుల వైకుంఠం, పల్లెర్ల ఆంజనేయులు తదితరులు డిమాండ్ చేశారు.

బట్టీ బతుకులు దుర్భరం

- మట్టి పని.. వెట్టి చాకిరీ
- పిట్టగూళ్ల లాంటి నివాసాలు
- కూలీలకు అందని వైద్య సేవలు
- అనూహ్య ఘటనలు జరిగితేనే అధికారుల్లో స్పందన
- ఆ తర్వాత ఇటుక బట్టీల వైపు కన్నెత్తి చూడని వైనం

సమాచారం	
ఇటుక బట్టీలు	104
వలస కూలీలు(సుమారు)	18,000



- పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేటలోని ఇటుక బట్టీలో పనిచేస్తున్న వలసకూలీలు కలుషితాహారం తిని అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనలో ఆరోగ్య పరిస్థితి విషమించి ఇద్దరు చనిపోయారు. ఈ ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది.
- రామగిరి మండలం కల్వచర్ల ప్రాంతంలోని ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న వలసకూలీ ప్రసాంతచరియాను బట్టి యజమాని సైంద్ల విష్ణు కొట్టాడు. ఈ ఘటనపై పోలీసులు గురువారం (ఈనెల8న) కేసు నమోదు చేశారు.

పెద్దపల్లిరూరల్: పొట్ట చేతపట్టుకుని వలస వచ్చిన ఒడిశా వలస కూలీలు ఇటుక బట్టీల్లో పనిచేస్తూ దుర్భర జీవితం గడుపుతున్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్, రామగిరి తదితర ప్రాంతాల్లోని బట్టీల్లో వలస కూలీలపై యజమానులు దాడులు సైతం చేయడం, అధికారులు పట్టించుకోకపోవడం సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేస్తోంది.

పిట్టగూళ్లను తలపించే నివాసాలు..

- వలస కూలీల ఉపాధి కోసం కుటుంబసభ్యులందరితో కలిసి ఇక్కడకు వలస వస్తున్నారు.
- వీరు ఇటుక బట్టీ ప్రాంతంలోనే పిట్టగూళ్ల లాంటి ఇరుకుగ గదుల్లో నివాసం ఉంటున్నారు.
- సమయమంటూ లేకుండా నిరంతరం పని చేస్తూనే ఉంటున్నారు.
- ఈవిషయంపై పౌర హక్కులు, ప్రజాసంఘాల నాయకలు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది.
- జిల్లాలోని మండలాలు, గ్రామాల్లో మొత్తం 104 ఇటుక బట్టీలు ఉండగా వాటిలో సుమారు 18వేల మంది దాకా వలస కూలీలు పనిచేస్తున్నట్లు కార్మిక శాఖ అధికారుల అంచనా.

అరకొర వసతులతో అవస్థలు..

ఇటుకల తయారీ కోసం వలస వచ్చిన కూలీలు అరకొర వసతులతో అనేక అవస్థలు పడుతున్నారు. గతంలో ఓసారి తమపై యజమానులు దాడికి దిగారంటూ కార్మికులు రోడ్డెక్కడంతో అప్పటి పాలకులు, అధికారులు అప్రమత్తమయ్యారు. బట్టీల వద్ద కార్మికులకు కనీస వసతులు లేవని నిర్ధారించిన అధికారులు.. బట్టీ యజమానులతో సమావేశమై పలు సూచనలు చేశారు.

ఆరుబయటే స్నానాలు..

- ఆడ, మగ, చిన్న, పెద్ద అనే తేడా లేకుండా కూలీలు ఇటుక బట్టీల సమీపంలోని బావులు, చెరువులు, ఇతర నీటి వనరుల్లో స్నానాలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.
- గతంలో కొందరు ఇక్కడి పరిస్థితులను తమ రాష్ట్ర అధికారులకు వాట్సాప్ ద్వారా సమాచారం అందించారు.
- తద్వారా ఏర్పడిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకున్న కొందరు బట్టీ యజమానులు.. కూలీల సెల్‌ఫోన్లు, ముఖ్యంగా టచ్‌స్క్రీన్ ఫోన్ల వినియోగంపై ప్రత్యేకంగా దృష్టి సారించడమే కాదు.. వాటిపై అనేక ఆంక్షలు విధించినట్లు సమాచారం.

వైద్యసేవలు అంతంతే..

కూలీలకు వైద్యసేవలు అందడం లేదు. మట్టిపనిలో నిమగ్నమయ్యే కూలీలతోపాటు వారి వెంట వచ్చిన చిన్నారులు, ఇతరులు వ్యాధుల బారిన పడితే యజమానులు ఏదో ఓ మందుబిళ్ల వారి చేతిలో పెట్టి మింగిన తర్వాత మళ్లీ పనులు చేయిస్తున్నారనే ఫిర్యాదులు ఎన్నాయి. గర్భిణులను బట్టీలకు సమీపంలోని పీహెచ్‌సీలకు తీసుకెళ్లి వైద్యపరీక్షలు చేయిస్తున్నారు. అనూహ్యంగా ప్రమాదాలు, దాడి సంఘటనలు జరిగితేనే వైద్యాధికారులు స్పందించి ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. అలా కాకుండా నెలకోసారైనా ఇటుక బట్టీల వద్దే ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేలా కలెక్టర్ చొరవ చూపితే వలస జీవుల ప్రాణాలకు భరోసా కలుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వలసకూలీల్లో ఎక్కువ మంది రక్త హీనతతో బాధపడుతున్నారు. దానిని అధిగమించేందుకు శనగలను కూలీలకు అందిస్తే పౌష్టికాహారం అందుతుందని అంటున్నారు.

చట్టాల అమలుపై పట్టింపేది?

కార్మికుల సంక్షేమం కోసం చట్టాలేవీ బట్టీల్లో పనిచేసే వలస కూలీలకు వర్తింపజేయడంలేదు. అనూహ్య సంఘటన చోటుచేసుకుంటేనే హడావుడి చేసే కార్మిక, రెవెన్యూ, పోలీసు అధికారులు.. ఆ తర్వాత బట్టీల్లో ఏం జరుగుతుందో కనీసం తెలుసుకునే కనీస ప్రయత్నాలు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. పెద్దపల్లి డీసీపీగా పనిచేసిన రూపేశ్ బట్టీల వద్ద ధ్రువ పేరిట పాఠశాలలు ఏర్పాటు చేయించారు. కూలీల పిల్లలకు చదువు చెప్పించేందుకు ప్రయత్నాలు చేశారు. ఆయన బదిలీ అయ్యాక చాలా బట్టీల్లో అవేమీ అమలు కావడంలేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇటుకబట్టీల వద్ద కనీస వసతులు కల్పించడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కూలీలు, వారి సంబంధీకులు కోరుతున్నారు.

అవయవ దానంపై అపోహలు వద్దు

- సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు



నేత్రదానంపై ప్రతిజ్ఞ చేస్తున్న ప్రతినిధులు

కోల్‌సిటీ(రామగుండం): నేత్ర, అవయవ, దేహదానాలపై అపోహలు వీడి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి, రాష్ట్రప్రతినిధి కేఎస్ వాసు కోరారు. గోదావరిఖని మార్కండేయ కాలనీలో సోమవారం నేత్ర, అవయవ, దేహదానం ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ నేత్ర, అవయవ, దేహదానాలపై సదాశయ ఫౌండేషన్ విస్తతంగా అవగాహన కల్పిస్తోందన్నా రు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నా.. ఇంకా ఎక్కువ మందికి అవగాహన రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. సదస్సుకు హాజరైన పలు సంస్థలకు చెందిన పలువురు అప్పటికప్పుడు స్పందించి నేత్ర దానం చేయడానికి ముందుకు వస్తున్నట్లు ప్రకటించారు. వారందరితో ప్రతిజ్ఞ చేయించి, సదాశయ డోనర్ కార్డులను అందజేదారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై శారద, తెలంగాణ పద్మశాలీ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు కొలిపాక సా రయ్య, ప్రతినిధులు సతీశ్, ఆడెపు రాము, పరికిపండ్ల కోటేశం, కొలిపాక నగేశ్, స్వప్న, దీప్తి, రిషిత, తాటి పాముల రమేశ్, కన్నం తిరుపతి, ఈగ చంద్ర య్య, మల్లేశ్వరి, కొలిపాక నగేశ్, బండి శ్రీనివాస్, తాటి కొండ శంకర్ తదతరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి

- టాస్క్ సీఈవో శ్రీకాంత్‌సింహ



అగ్రిమెంట్లు మార్చుకుంటున్న ప్రతినిధులు

రామగిరి(మంథని): ఉద్యోగాలు సాధించడం కన్నా ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదిగేలా విద్యార్థులను తీర్చి దిద్దడం ధ్యేయంగా ఎస్ఏపీ శిక్షణ ఇస్తుందని టాస్క్ సీఈవో శ్రీకాంత్‌సింహ అన్నారు. సోమవారం స్థానిక జేఎన్టీయూలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) సహకారంతో ఎస్ఏపీ ఎడ్యునెట్‌తో ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, ఎస్ఏపీ డైరెక్టర్ ఆశీష్ అరోరా చేసుకున్న ఎంవోయూలపై సంతకాలు చేశారు. తెలంగాణ వ్యాప్తంగా 15 కేంద్రాలను టాస్క్ ఎంపిక చేయగా ఇందులో మంథని జేఎన్టీయూ ఒకటి కావడం విశేషమన్నారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న సంస్థ ఎస్ఏపీ అని, మారుమూల ప్రాంతమైన మంథని ఇంజినీరింగ్ కళాశాలతో ఒప్పందం చేసుకోవడం సంతోషకరమన్నారు. ఉద్యోగాలు దక్కించుకునేందుకు కావాల్సిన నైపుణ్యం నేర్పుతూనే.. మరోవైపు ఉద్యోగాలు ఇచ్చే ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా తయారు చేయడమే లక్ష్యంగా ఎస్ఏపీ శిక్షణ ఇస్తోందని తెలిపారు. పేద విద్యార్థులను ప్రోత్సహించాలనే ప్రభుత్వ ఆదేశాలతో మారుమూల ప్రాంతంలోని మంథని ఇంజినీరింగ్ కళాశాలను ఎంపిక చేసుకున్నామన్నారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఏకాగ్రతతో శిక్షణ పొందాలని సూచించారు. లాజికల్‌గా ఆలోచిస్తూ ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏపీ విభాగాధిపతి సాగరిక బోస్, ఈఈఈ, సీఎస్ఈ విభాగాల అధిపతులు ఆర్.దుర్గారావ్, రాంనరేశ్, ఆఫీస్ సూపరింటెండెంట్ రవికుమార్, టాస్క్ రిలేషన్‌షిప్ మేనేజర్ గంగాప్రసాద్, ఎస్ఏపీ ప్రోగ్రాం మేనేజర్ ప్రదీప్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ సెల్ ఇన్‌చార్జి కావ్య, ఎడ్యునెట్ ప్రతినిధులు రవీందర్, బిదన్, షేక్ వాహాబ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుబంధు పేరుతో సైబర్ మోసం

- నాచుపెల్లి గ్రామానికి చెందిన ముగ్గురి డబ్బులు మాయం

కొండగట్టు(చొప్పదండి): రైతుబంధు పేరుతో సైబర్ మోసం జరిగింది. కొడిమ్యాల మండలం నాచుపెల్లి గ్రామానికి చెందిన గాజర్ల సౌమ్య కొద్దిరోజుల క్రితం తన కుటుంబ సభ్యుడు చనిపోవడంతో రూ.5 లక్షల రైతుబీమా పొందింది. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో 98738 22391 నంబర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఆమెకు ఫోన్ చేశాడు. రూ.21వేల రైతు బంధు డబ్బులు వచ్చాయని, ఏదైనా ఖాతా నంబర్ ఇస్తే దానికి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేస్తానని నమ్మబలికాడు. తన కుటుంబం, రైతు బీమా వివరాలు పక్కాగా చెప్పడంతో నిజమని నమ్మింది. ఈక్రమంలో మరో వ్యక్తి ఫోన్ నంబర్ కావాలని సైబర్ మోసగాడు అడగడంతో సౌమ్య తన పక్కనే ఉన్న తాళ్లపల్లి సంధ్య నంబర్ ఇచ్చింది. కాగా, సౌమ్య అకౌంట్‌కు రూ.9వేలు జమ చేశానని, అంతకంటే ఎక్కువ జమకావడం లేదని, మరొకరి ఫోన్ నంబర్ ఇవ్వాలని మోసగాడు నమ్మించాడు. దీంతో సంధ్య తన భర్త సుమన్ నంబర్ ఇచ్చింది. సుమన్ తన యూపీఐ నంబర్ చెప్పగా, సదరు ఖాతాకు డబ్బు ట్రాన్స్‌ఫర్ కావడం లేదని మరో వ్యక్తి ఫోన్‌నంబర్ ఇవ్వాలని కోరడంతో సుమన్ తన పక్కింటి తాళ్లపెల్లి రమేశ్ నంబర్ ఇచ్చాడు. ఈక్రమంలో సంధ్య ఖాతా నుంచి రూ.8,859, సుమన్ ఖాతా నుంచి రూ.18,549, రమేశ్ ఖాతానుంచి రూ.98,000 మాయమయ్యాయి. సైబర్ మోసగాడు తమ పేర్లు, వివరాలు పక్కాగా చెప్పడంతో తాము మోసపోయామని, సైబర్ మోసగాళ్ల చేతుల్లోకి తమ సమాచారం ఎలా వెళ్లిందో తెలియడం లేదని బాధితులు తెలిపారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

26న బలనిరూపణ సమావేశం

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ మద్దెల కమలపై సభ్యులు ఇటీవల అవిశ్వాస తీర్మానం నోటీసు అధికారులకు అందజేశారు. దీనిపై ఈనెల 26 బలనిరూపణ కోసం జిల్లాసహకార అధికారి పదిమంది సభ్యులకు సోమవారం నోటీసులు అందజేశారు. చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ కమల, సభ్యులు ఆళ్ల సుమన్‌రెడ్డి, కట్కూరి కవిత, కాంతాల సమ్మిరెడ్డి, బొంగోని శ్రీనివాస్‌గౌడ్, కోట విజయ, కొట్టె దేవేందర్, తాళ్లపల్లి సదయ్య, చింతం కుమారస్వామి, గుగులోతు పర్శ్యనాయక్, మూల ప్రేంసాగర్‌రెడ్డికి నోటీసులు అందజేశారు. ముఖ్య కార్యనిర్వహణాధికారి కరీంనగర్, ఓదెల మండల పరిషత్ కార్యాలయాల నోటీసు బోర్డుపై నోటీసు అంటిస్తారు.

మాజీ ఎమ్మెల్యే మృతికి అసెంబ్లీలో సంతాపం

సుల్తానాబాద్(పెద్దపల్లి): పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు మృతికి అసెంబ్లీలో సోమవారం స్పీకర్ గడ్డం ప్రసాద్ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. కార్మిబార్ నుంచి ఎమ్మెల్యే వరకు ప్రస్థానం సాగించిన బిరుదు రాజమల్లు పెద్దపల్లి ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేనికృషి చేశారని సభ్యులు కొనియాడారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు.

బొగ్గుబాయి వార్తలు

మహిళలకు ఉపాధి శిక్షణ



మహిళలతో జీఎంలు వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ

రామగిరి(మంథని): సింగరేణి పరిసర ప్రాంత మహిళల కోసం చేపట్టిన ఉపాధి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఏ, ఆర్జీ-3 ఇన్‌చార్జి జీఎంలు వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ తెలిపారు. స్థానిక ఎంవీటీసీలో సీఎస్ఆర్ నిధులతో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టిన మగ్గం డిజైనింగ్, టెక్స్‌టైల్ ఫ్యాబ్రిక్ డైయింగ్ ఉచిత ఉపాధి శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి సింగరేణి విరివిగా నిధులు వెచ్చిస్తోందని తెలిపారు. వాటితో పర్యావరణ హిత, సామాజిక, ఉపాధి శిక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తోందని అన్నారు. అనంతరం శిక్షణకు హాజరయ్యే మహిళలకు మగ్గం వర్క్ డిజైనింగ్, టెక్స్‌టైల్ డైయింగ్ పరికరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం బైద్య, యూనియన్ నాయకులు ఎంఆర్‌సీ రెడ్డి, కొట రవీందర్‌రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఎ.శ్రీనివాస్, వై.వెంకన్న, వినోద్‌కుమార్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తిచేయాలి

- ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్



ఉద్యోగులతో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: కేటాయించిన పనులను సకాలంలో పూర్తిచేయాలని ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ సూచించారు. సోమవారం జీఎం కార్యాలయంలోని అన్నిడిపార్ట్‌మెంట్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న ఉద్యోగులతో మాట్లాడి వారు చేస్తున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. విధులు సక్రమంగా నిర్వహించాలని, సమయపాలన తప్పని సరిగా పాటించాలని సూచించారు. పనులను పెండింగ్ లేకుండా వేగంగా పూర్తిచేయాలన్నారు. ప్రతీఒక్కరు క్రమశిక్షణ, అకింతభావంతో పనిచేయాలని, అందరూ సమష్టిగా విధులు నిర్వహించి సంస్థ నిర్దేశించిన లక్ష్యసాధనలో భాగస్వాములము కావాలని కోరారు. జీఎం వెంట ఏజీఎం(పర్సనల్) లక్ష్మీనారాయణ, ఐఈడీ ఏజీఎం ఆంజనేయులు, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, సీనియర్ పీవో సారంగపాణి ఉన్నారు.

యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి

- ఆర్జీ-2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ



పూజలు చేస్తున్న జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని: భారీ యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని వార్షిక లక్ష్యాల సాధనలో ముందుండాలని ఆర్జీ-2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ సూచించారు. సోమవారం ఓసీపీ-3 కృషిభవన్‌లో రెండు నూతన షావల్స్‌కు పూజలు నిర్వహించి ప్రారంభించారు. తుంగభద్ర, మహానదిగా ఆ యంత్రాలకు నామకరణం చేశారు. రూ.4.63కోట్ల వ్యయంతో ఒక్కో యంత్రాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. ఇప్పటివరకు ఐదు నూతన యంత్రాలను వినియోగంలోకి తీసుకొవచ్చామని అన్నారు. పూర్తి పని గంటలు వినియోగిస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ జిగురు రవీందర్, ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, ఇంజినీర్ రాజాజీ, గని మేనేజర్ డి.రమేశ్, షావల్స్ సెక్షన్ ఇన్‌చార్జి విజేందర్ రెడ్డి, సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్‌మహమ్మద్, సంక్షేమాధికారి సురేందర్ పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రామగుండం రీజియన్ అధ్యక్షురాలు బుచ్చమ్మ కోరారు. సోమవారం ఆర్జీ-2 ఏరియా లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సమ్మె ప్రచార వాల్ పోస్టర్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. సింగరేణిలో పనిచేస్తున్న అన్ని సెక్షన్ల కాంట్రాక్ట్ కార్మికులు, సింగరేణి కార్మికులు, రైతులు, ప్రజలు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు పద్మ, కాంతమ్మ, రాజనర్సు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

'సింగరేణిపై యాజమాన్యంపై చర్య తీసుకోండి'

రామగిరి(మంథని): లద్నాపూర్ గ్రామంలో గల పోచమ్మ అలయం వద్ద భక్తులకు ఇబ్బందులు, అసౌకర్యం కల్పిస్తున్న సింగరేణి సంస్థపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కోరారు. ఈమేరకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. భక్తులకు ఇబ్బందులు కలిగేలా గుడిచుట్టూ ఇనుప కంచెలు ఏర్పాటు చేసి, లోతైన కందకాలు తవ్వించారని, భారీ వాహనాలకు రోడ్డు నిర్మించి భక్తులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విగ్రహం తొలిగింపు పనులకు పూనుకున్నారని ఆవేదన చెందారు. తమకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సింగరేణి సంస్థ సహకరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. వినతిపత్రం అందించిన వారిలో గ్రామస్తులు పొన్నం సత్యనారాయణగౌడ్, తాటి శ్రీనివాస్, మేడగొని రాంచందర్‌గౌడ్, ఎస్‌కే జమీల్, తాళ్లపెల్లి చంద్రయ్య, చిప్ప అనిల్, సరివేద్ది శ్రీనివాస్ పాల్గొన్నారు.

'సీఎంపీఎఫ్ కుంభకోణంపై విచారణ జరిపించాలి'

గోదావరిఖని: బొగ్గు గని కార్మికుల భవిష్యనిధి(సీఎంపీఎఫ్) కుంభకోణంపై సీబీఐ విచారణ జరిపించాలని బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి, సీఎంపీఎఫ్ ట్రస్టీ బోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం అఖిల భారతీయ కథాన్ మజ్దూర్ సంఘ్, బీఎంఎస్ ఆధ్వర్యంలో సీఎంపీఎఫ్ రాంచీ ప్రాంతీయ కార్యాలయంలో మహాధర్నా నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ, సీఎంపీఎఫ్‌లో జరిగిన రూ.900 కోట్ల కుంభకోణం గురించి సీబీఐ ద్వారా విచారణ జరిపించాలన్నారు. బాధ్యులైన అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బొగ్గు గని కార్మికుల భవిష్య నిధి భద్రంగా ఉంచడం కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామని అన్నారు. పరిశ్రమలలో భవిష్య నిధిని ప్రతీ కార్మికునికి భరోసాగా ఉండాలని కోరారు. కుంభకోణాలకు పాల్పడిన అధికారులపై చర్య తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

నా కొడుకును కాపాడండి

- ఆపన్నహస్తం కోసం మాతృమూర్తి ఎదురుచూపులు
- రోడ్డు ప్రమాదంలో యువకుడి వెన్నుపూసకు గాయం



వేడుకుంటున్న తల్లి

గంభీరావుపేట(సిరిసిల్ల): ఓ ప్రమాదం.. ఆ కుటుంబాన్ని రోడ్డున పడేసింది. కుటుంబానికి పెద్దదిక్కుగా నిలిచిన కొడుకును మంచానికే పరిమితం చేసింది. కూలీ పనికి వెళ్తుండగా బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో వెన్నుపూస, మెదడుకు గాయాలై లేవలేని స్థితికి చేరుకున్నాడు. తన కొడుకు ప్రాణాలను కాపాడాలని ఆ నిరుపేద తల్లి వేడుకుంటుంది. గంభీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన బోసగిరి కృష్ణంరాజు గత నవంబర్ నెలలో బైక్ అదుపుతప్పి గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చేరగా రెండు ఆపరేషన్లు చేసి ఇంటికి పంపించారు. ఆరోగ్యం కుదుట పడకపోవడంతో రూ.5లక్షల వరకు అప్పులు చేసి ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికే మంచానికే పరిమితమయ్యాడు. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో యువకుడి ఆరోగ్య పరిస్థితి రోజురోజుకు క్షీణించిపోతోంది. ప్రస్తుతం రెండు కాళ్లకు, ఎడమ చేతికి స్పర్శ లేదు. ఇంకా వైద్యం చేయించడానికి ఆర్థిక స్థోమత లేదని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య సహాయం కోసం ఆపన్నహస్తం అందించాలని వేడుకుంటున్నారు. దాతలు స్పందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.బాధితుడి పూర్తి వివరాల కోసం ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరుతున్నారు.

ఫోన్ నంబర్ 95021 42538